# మనం

కృష్ణా / గుంటూరు

ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు

సోమవారం | 14 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 9




5 లో

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

వెబ్ డెవలపర్, టూ వీలర్

మెకానిక్ కోర్సుల్లో శిక్షణ

అనంతరం ఉపాధి అవకాశాలు

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



6 లో

# ఖైరతాబాద్ వినాయకుడి మాదిరిగా 'డూండీ' గణపతి

పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా...

ఆరేళ్ల నుంచి 72అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు

ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

-విజయవాడ, మనంబ్యూరో

పి.మీరాహుస్సేన్ ఖాన్

ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలకు మాదిరిగా డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. సంప్రదాయాలను పాటిస్తూ, పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా ఆరేళ్ల నుంచి 72 భారీ అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తూ వస్తున్న డూండీ గణేశ్ సేవా సమితి సభ్యులను అభినందించారు. ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. విజయవాడలోని విద్యాధర పురంలో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల చముఖ వరసిద్ధి మహా గణపతి భారీ విగ్రహం ఆగమన వేడుకను మంత్రి సవిత ఆదివారం రాత్రి ప్రారంభించారు.

## వినాయక చవితి శుభాకాంక్షలు

పాఠకులు,
ప్రకటన కర్తలు,
ఏజెంట్లు,
శ్రేయోభిలాషులకు
గణేశ చతుర్థి
శుభాకాంక్షలు



పండుగ సందర్భంగా సోమవారం పత్రికా కార్యాలయానికి సెలవు. కావున 15వ తేదీ పత్రిక వెలువడదు. 16వ తేదీన పునర్దర్శనం.



## గణేష్ ఉత్సవాల్లో... పర్యావరణ హితానికి పెద్దపీట

9 లో



ప్రకృతిని కాపాడుతూ...

వినాయక చవితి జరుపుకుందాం

జిల్లా జాయింట్ కలెక్టర్

ఎస్.ఇలక్కియ



## క్రీడా ఉత్సవ్‌కు అంకురార్పణ

ఘనంగా ప్రారంభమైన స్కై ప్రీమియర్ లీగ్..!!

ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్..!!

క్రికెట్ పోటీలను ప్రారంభించిన కూటమి పార్టీల అగ్ర నేతలు...!!



4 లో

# లారీ ఢీకొని 20 గొర్రెలు మృతి



**బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ఆరు లక్షల ఆర్థిక సహాయం ఇప్పించిన యువ నేత శ్రీరాం చిన్నబాబు**

**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13: మనం న్యూస్:** జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన యామర్తి శ్రీనివాసరావు కి చెందిన 20 గొర్రెలు లారీ ఢీకొనడంతో ఇటీవల అక్కడికక్కడే మృతి చెందాయి. గొర్రెల పెంపకమే జీవనాధారంగా ఉన్న ఆ కుటుంబానికి ఈ ఘటనతో తీరని నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న యువ నాయకులు, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం చిన బాబు హుటాహుటిన స్పందించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం తన సొంత చొరవతో లారీ ఓనర్ తో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ. 6 లక్షల నష్టపరిహారం ఇప్పించారు. గొర్రెల పెంపకమే జీవనాధారంగా బతికే తమకు 20 గొర్రెలు చనిపోతే కోలుకోలేని నష్టం కలిగిందని, తమకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన శ్రీరామ్ చినబాబుకు గొర్రెల యజమాని శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి వెంకటేశ్వర్లు, యామర్తి బోస్ యాదవ్, మూడు రాంబాబు, జనకిరామయ్య,ఎనికె గోపి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారి అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట: సెప్టెంబర్ 13 మనం న్యూస్:** జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్ నందు ముత్యాలమ్మ అమ్మవారి కమిటీ సభ్యులు అప్పన మణికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ.. ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో జగ్గయ్యపేట ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పూజ దాతలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## రేషన్ బియ్యం నిల్వలపై రెవెన్యూ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు

**కంచికచర్ల, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** కంచికచర్ల మండలోని కీసర గ్రామ( సైదాపురం) మామిడి తోటల్లో అక్రమంగా దాగి వున్న రేషన్ బియ్యం నిల్వలపై రెవెన్యూ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు 28 క్వింటాళ్ల అక్రమ నిల్వ ఉన్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు షేక్ ఖాజా రెహముద్దీన్ అనే వ్యక్తి ఈ రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచినట్లుగా రెవెన్యూ అధికారుల విచారణలో బయటపడింది రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కీసర గ్రామం లో రేషన్ షాప్ కు అప్పగించారు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశారు.



# ప్రజలను ఇబ్బంది పెట్టే చట్టాలపై ప్రభుత్వం పునః సమీక్షించాలి

**చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, ఏఎంసి మాజీ చైర్మన్ లు తుమ్మేపల్లి నరేంద్ర, మానేపల్లి నాగబ్రహ్మం**

**జగ్గయ్యపేటలో సర్వీస్ ఈనం భూ బాధితుల వంటా వార్పు**




**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 13 మనం న్యూస్:** ప్రజలను ఇబ్బంది పెట్టే చట్టాలపై ప్రభుత్వం పునః సమీక్షించాలని, అవసరమైన సవరణలు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జగ్గయ్యపేట ప్రతినిధులు మాజీ ఏఎంసి చైర్మన్ లు తుమ్మేపల్లి నరేంద్రరావు, మానేపల్లి నాగబ్రహ్మం లు కోరారు. జగ్గయ్యపేటలో ఎన్టీఆర్ సర్కిల్ లో ఇనాం భూభాదితులు చేపట్టిన రిలే నిరాహారదీక్షల ఏడో రోజు శిబిరాన్ని వారు ఏఎంసి డైరెక్టర్ దేవరశెట్టి నాగప్రసాద్, నూకల బాలకృష్ణ, న్యాయవాది రాయపూడి శ్రీనివాస్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వీస్ ఇనాం భూములపై నిషేధం విధించటం వల్ల వందలాదిమంది భూ యజమానులు ఇబ్బందులు పడుతున్నందున 16/2013 చట్టాన్ని పున సమీక్షించాలని కోరారు. సర్వీస్ ఇనామ్ సమస్యను ఫెడరేషన్ ఆఫ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కరించాలని కోరతామని వారు చెప్పారు. సీనియర్ న్యాయవాది రాయపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2013 వరకు లేని సమస్యలు దేవాదాయ శాఖ అధికారులు తర్వాత సృష్టించారని చెప్పారు. ప్రభుత్వమే మొదట్నుంచి ఆ భూములపై నిషేధం విధించి ఉంటే ఇంతమంది బాధితులు అయ్యేవారు కాదని అన్నారు. ఏఎంసి డైరెక్టర్ దేవరశెట్టి నాగప్రసాద్ మాట్లాడుతూ సున్నితమైన ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.




### ఇనాం భూ బాధిత మహిళలు వంటావార్పు

ఇనాం బాధితులు రిలే నిరాహార దీక్ష శిబిరం వద్దకు మద్దతు తెలిపేందుకు వచ్చిన భూభాదిత కుటుంబాల మహిళలు ఎన్టీఆర్ సర్కిల్లో వంటావార్పు నిర్వహించారు. చంటి పిల్లలతో వచ్చి కొందరు మహిళలు పాల్గొనటం విశేషం. ప్రభుత్వం తమ భూములపై నిషేధం విధించడం వల్ల రోడ్డున పడ్డామని, భూమిలేని పేదలుగా మిగిలామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.

## వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

**జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు**



**జగ్గయ్యపేట: సెప్టెంబర్ 13 మనం న్యూస్:** వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా సురక్షితంగా నిర్వహించాలని జగ్గయ్యపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పి వెంకటేశ్వర్లు సూచించారు. పట్టణ ఎస్సై జి రాజు అధ్యక్షతన మండపాల నిర్వాహకులకు ఉక్కు కళావేదిక,లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట సీఐ పి. వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్ఐ జి. రాజు పాల్గొని వినాయక మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్ని ప్రమాదాల నివారణ, డీజేమరియు సౌండ్ సిస్టమ్ వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, ఊరేగింపు మరియు నిమజ్జనం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా నిబంధనలకు అనుగుణంగా డి జె లను వినియోగించాలని, విద్యుత్ వైరింగ్ను అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్తో చేయించాలని సూచించారు. మండపాల వద్ద ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయంలో బయటకు వెళ్లే మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదని తెలిపారు. వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా, క్రమశిక్షణతో వ్యవహరించాలని, వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణించరాదని సూచించారు. నిమజ్జనం రోజున పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను మాత్రమే వినియోగించాలని, చిన్నపిల్లలు మరియు ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వినాయక చవితి వేడుకలను సంతోషంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ పి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ జి. రాజు కోరారు.

## రూ.12వేల వరకు ఎక్స్ఛేంజ్ బోనస్తో క్రోమాలో ఐఫోన్ 18 ప్రో లైనప్ ప్రీ-బుకింగ్స్




**గాంధీనగర్ సెప్టెంబర్ 13 మనం న్యూస్:** టాటా గ్రూప్నకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ రిటైలర్ క్రోమా, ఐఫోన్ 18 ప్రో, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ ప్రీ-బుకింగ్స్ను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 200కు పైగా నగరాల్లోని 560కి పైగా క్రోమా స్టోర్లతో పాటు క్రోమా వెబ్సైట్, టాటా న్యూ యాప్, బిగ్బాస్కెట్ ద్వారా ప్రీ-బుకింగ్స్ చేసుకోవచ్చని తెలిపింది. స్టోర్లలో రూ.5,000 చెల్లించి ప్రీ-బుక్ చేసుకునే అవకాశం ఉండగా, ఆన్లైన్లో పూర్తి మొత్తాన్ని చెల్లించాలి. కస్టమర్లు రూ.12,000 వరకు ప్రత్యేక ఎక్స్ఛేంజ్ బోనస్ పొందవచ్చు. కొత్త ప్రో లైనప్లో ఏ20 ప్రో చిప్, సీ2 వైర్లెస్ మోడెమ్, భౌతికంగా మారే అపెర్చర్తో కూడిన 48 మెగాపిక్సెల్ ఫ్యూజన్ ప్రధాన కెమెరా వంటి అధునాతన సాంకేతికతలు ఉన్నాయి. ఇదే సమయంలో ఐఫోన్ 17 ప్రో, 17 ప్రో మ్యాక్స్పైక్రోమా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. స్టోర్లలో ఐఫోన్ 17 ప్రో 256 జీబీ రూ.69,990, 512 జీబీ రూ.88,490కు, 17 ప్రో మ్యాక్స్ 256 జీబీ రూ.74,990, 512 జీబీ రూ.94,990కు లభించనున్నాయి. ఎంపిక చేసిన క్రెడిట్ కార్డులపై రూ.4,000 వరకు నగదు వెనక్కి, పాత ఐఫోన్ల మార్పిడిపై అదనపు విలువతో పాటు రూ.12,000 వరకు బోనస్ పొందవచ్చు. సెప్టెంబర్ 15 నుంచి క్రోమా వెబ్సైట్లోనూ ప్రత్యేక ధరలు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది.

# యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశా కల్పనలోను జయప్రద ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం



▸▸ కె డిసిసి బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘు రామ్, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

▸▸ జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన

**జగ్గయ్యపేట సెప్టెంబర్ 13 మనం న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు సేవా కార్యక్రమాలలోనే కాక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలోనూ జయప్రద ఫౌండేషన్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేడీసీసీ బ్యాంకు చైర్మన్, మాజీమంత్రి నెట్టెం రఘురాం, శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ లు అన్నారు. జయప్రద ఫౌండేషన్ చైర్మన్ , తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని శుభమస్తు కల్యాణ మండపంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. యువతకు జయప్రద ఫౌండేషన్ వారు ఐటి, నాన్ ఐటి ల నుండి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంకల్పంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని జయప్రద ఫౌండేషన్ ఈ జాబ్ మేళా కార్యక్రమం ను జగ్గయ్యపేటలోని శుభమస్తు కళ్యాణమండపం నందు నిర్వహించింది. ఈ జాబ్ మేళాకు రెండు వేల మంది హాజరు కాగా వీరిలో నాన్ ఐటీ లో 1200 మంది హాజరు కాగా 800 మందికి, ఐటీలో 490 మంది హాజరు కాగా 490 మందినీ సెలెక్ట్ చేయడం జరిగింది. నాన్ ఐటి వారికి వెంటనే ఆఫర్ లెటర్ ఇవ్వగా ఐటి వారికి రెండవ దశలో ఇంటర్వ్యూ జరగనుంది. ఈనాటి కార్యక్రమంలో పాల్గొన్న తులసి సీడ్స్ అధినేత శ్రీరామచంద్ర ప్రభు మాట్లాడుతూ భవిష్యత్తుకు మార్గదర్శకులు విద్యా వైద్య రంగాలతో పాటు ఉపాధి రంగాలను కూడా యువతకు అవకాశాలను సృష్టిస్తూ ఈ ప్రాంతంలో జీవనోపాధికి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్న తొండపు దశరథ జనార్ధన్ ని అభినందిస్తున్నానని యువత కూడా క్రమశిక్షణతో పట్టుదలతో అవకాశాలను అందుకోవాలని భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని తెలియజేసినారు. మాజీ మంత్రివర్యులు కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ జనార్ధన్ గత సంవత్సరం కాలంగా అందిస్తున్న వైద్య సేవలతో పాటు ఉపాధి అవకాశాలను యువతకు అందించటం ఆయన చేస్తున్న కృషిని అభినందించినారు. శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ జాబ్ మేళా ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు అందిస్తున్నారని వారిని అభినందిస్తున్నానని యువత లాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరినారు. ఈనాటి కార్యక్రమంలో తులసి సీడ్స్ ఎండి యోగేష్ , విద్యా భారతి చైర్మన్ వెలగపూడి రామకృష్ణ , బోడేపూడి అమర్ , కావూరి శ్రీధర్, సిద్ధార్థ అకాడమీ ప్లేస్మెంట్ ఆఫీసర్, చెరుకూరి చాముండేశ్వరి, తొండపురాజు వర్ధన్, గౌతమి సరోజ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు చింతల సీతారామయ్య వడ్లమూడి రాంబాబు గారు వివిధ హోదాలో ఉన్న నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. ఈనాటి కార్యక్రమానికి సేవలు అందించిన మండవ ఇంజనీరింగ్ కాలేజీ, అమ్మానీ కాలేజీ, లైఫ్ స్కిల్ కాలేజీ, జె ఆర్ సి కాలేజీ, విశ్వ భారతి కాలేజీ, ప్రిన్సిపాల్ కు వాలంటీర్లుగా సేవలందించిన విద్యార్థిని విద్యార్థులకు జయప్రద ఫౌండేషన్ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసినారు.






# మట్టి విగ్రహాలనే వాడదాం, పర్యావరణాన్ని కాపాడుదాం

▸▸ విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి



**జగ్గయ్యపేట సెప్టెంబర్ 13 మనం న్యూస్:** మట్టి గణపతి విగ్రహాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి పర్యావరణాన్ని కాపాడదామని విజ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి అన్నారుసోమవారం జరుపుకోబోయే వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక విజ్ఞాన్ స్కూల్ లో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు.స్కూల్ డైరెక్టర్ శ్రీమతి తన్నీరు సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలలో విద్యార్థులు గణేశుని ఆకృతిలో కూర్చొని చేసిన విన్యాసం సూపర్ లను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగాస్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి మాట్లాడుతూ వినాయక చవితి యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తూ పర్యావరణాన్ని పరిరక్షించటానికి, చాల తేలికగా నీళ్ళలో కరిగిపోయే బంకమట్టితో చేయబడిన , సహజ రంగులతో అలంకరిచబడిన విగ్రహాలనేపూజించాలని ,ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో , రసాయనాలతో కూడిన రంగులతో తయారు చేయబడిన విగ్రహాలను పూజించటం వలన వాతావరణం ఎంతో కాలుష్యం అవుతున్నదని , నిమజ్జన సమయంలో అవినీళ్ళలో కరగక నదులు , కాలువలు కాలుష్యం అవుతున్నాయని,తమ ఇళ్ళలోమట్టి తో చేయబడిన విగ్రహాలనే పూజించి , నీటి కాలుష్యాన్ని అరికట్టి , పర్యావరణాన్ని పరిరక్షించాలని తద్వారా, భగవంతుని కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు . విద్యార్థులచే మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి పంపిణీ చేసారు . ' మట్టి విగ్రహాలనే వాడడం , పర్యావరణాన్ని కాపాడుదాం ' , ' రసాయన విగ్రహాలను వదిలేద్దాం - జీవకోటిని బ్రతికిద్దాం ' , ' చెరువు మట్టినే వాడదాం - జల సంరక్షణ చేపడదాం ' , ' విఘ్నేశ్వరుని కోసం మా భవిష్యత్తుకు విఘ్నాలు కలిగించొద్దు ' , ' పరిమాణం వద్దు - భక్తి భావం ముద్దు ' అంటూ విద్యార్థులు విద్యార్థులు నినాదాలు చేశారు.

# కంచికచర్ల గ్రామంలో సందడే సందడి

**కంచికచర్ల, సెప్టెంబర్ 13(మనం న్యూస్):** వినాయక చవితి సందర్భంగా ఆదివారం సాయంత్రం కంచికచర్ల గ్రామంలో సందడి నెలకొంది. పండగకు అవసరమైన పూజా సామగ్రి, పూలు, పండ్లు, ఇతర వస్తువుల కొనుగోలుకు ప్రజలు పెద్దసంఖ్యలో మార్కెట్ తరలివచ్చారు. దీంతో ప్రధాన రహదారులు, దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. చిన్నారులు, కుటుంబాలతో కలిసి షాపింగ్ రావడంతో వ్యాపార ప్రాంతాలు కళకళలాడాయి. పండగ ముందు రోజు కావడంతో ఎటుచూసినా సందడి వాతావరణం కనిపించింది.



# వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



▸▸ డీసిల్టింగ్ పనులు నిరంతరాయంగా కొనసాగించాలి

▸▸ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ,సెప్టెంబర్,13,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఉదయం శాఖాధిపతులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, నగరంలో వర్షాల పరిస్థితి, పారిశుధ్య చర్యలు, డీసిల్టింగ్ పనులు, ప్రజలకు అవసరమైన సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మాన్సూన్ రెస్పాన్స్ టీమ్స్ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా వర్షపు నీరు నిలిచిపోకుండా, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. మూడు సర్కిళ్ల పరిధిలోని అవుట్ఫాల్ డ్రెయిన్లు, ప్రధాన డ్రెయిన్ల వద్ద జేసీబీలను వినియోగించి సిల్ట్ తొలగింపు పనులు నిరంతరం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కొనసాగుతున్న డీసెల్టింగ్ పనులను వేగవంతం చేసి, అవసరమైన ప్రాంతాల్లో అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా డ్రెయిన్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. అదేవిధంగా, భారీ వర్షాలు కురిసే పరిస్థితుల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్లను పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భోజనం తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు తమ పరిధిలోని పునరావస కేంద్రాలను పరిశీలించి, అవసరమైన అన్ని వసతులు సమకూర్చాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించే విధంగా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

# మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణహితంగా వినాయక చవితిని జరుపుకుందాం

▸▸ పూజా, పూల వ్యర్థాలను కాలువల్లో వేయకుండా నగరపాలక సంస్థకు అందజేయాలి

▸▸ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ,సెప్టెంబర్ 13,(మనం న్యూస్):**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఉదయం నగర ప్రజలకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితిని ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ జరుపుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. మట్టి వినాయక ప్రతిమల వినియోగం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తెలిపారు.వినాయక ప్రతిమల నిమజ్జనం సమయంలో పూలు, పూజా సామగ్రి, ఇతర పూజా వ్యర్థాలను కాలువల్లో లేదా బహిరంగ ప్రదేశాల్లో పడవేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి అందజేయాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. సేకరించిన పూల వ్యర్థాలను వినియోగించి అగరబత్తులు, ధూప్ స్టిక్స్ వంటి పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజలందరూ పరిశుభ్రతను పాటిస్తూ, పర్యావరణానికి హాని కలగకుండా వినాయక చవితిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర కోరారు.

# నగరంలోని అవుట్ఫాల్ డ్రెయిన్లలో ముమ్మరంగా డీసెల్టింగ్ పనులు

**▸▸ జేసీబీల సహాయంతో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాల తొలగింపు**

**విజయవాడ,సెప్టెంబర్,13,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం నగరంలోని అవుట్ఫాల్ డ్రెయిన్లలో డీసెల్టింగ్ పనులను అధికారులు ముమ్మరంగా చేపట్టారు. జేసీబీల సహాయంతో డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను శరవేగంగా తొలగించే ప్రక్రియను కొనసాగించారు. ఈ సందర్భంగా సీవీఆర్ ఫ్లైఓవర్ సమీపంలోని అవుట్ఫాల్ డ్రెయిన్, రామవరప్పాడు వద్ద గల అవుట్ఫాల్ డ్రెయిన్, లయోలా కాలేజ్ సమీపంలోని అవుట్ఫాల్ డ్రెయిన్ ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, కొనసాగుతున్న డీసిల్టింగ్ పనులను పర్యవేక్షించారు. వర్షపు నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా అవుట్ఫాల్ డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్ట్, వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో వర్షాల నేపథ్యంలో డీసిల్టింగ్ పనులను నిరంతరాయంగా కొనసాగిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో యంత్రాలు, సిబ్బందిని వినియోగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

## ఈషా కళాశాల ఇరువురి
# అధ్యాపకులకు గ్లోబల్ ఎడ్యుకేషన్ అవార్డ్స్





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 13, మనం న్యూస్:** టీచర్స్ హబ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఆదివారం నాడు గుంటూరు గౌర్నమెంట్ మెడికల్ కళాశాలలో 2026వ సంవత్సర ఉత్తమ ఉపాధ్యాయ, అధ్యాపకులకు అవారడ్స్ బహూకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విజయవాడ లోని ఈషా కాలేజ్ ఆఫ్ కామర్స్ కళాశాల తరుపున కామర్స్ విభాగాధిపతి మరియు ఎజిఎం కాల్విన్ మెజిస్టీ జాతీయ ఉత్తమ ప్రొఫెసర్ గా అవార్డును అందుకున్నారు.అదే విధంగా ఎకనామిక్స్ విభాగం తరుపున ఏసుఈస్వర్ ఉత్తమ ప్రొఫెసర్ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఈషా కాలేజ్ చైర్మన్ సుంకసాని గోపీచంద్, మేనేజింగ్ డైరెక్టర్ అనన్య, అకడమిక్ డీన్ క్రాంతి కుమార్, ప్రిన్సిపాల్ చంటిబాబు మరియు సిబ్బంది వారిని అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గోపీచంద్ మాట్లాడుతూ మా కళాశాలలో పనిచేస్తున్న ఇద్దరి అధ్యాపకులకు అవార్డ్స్ రావడం ఎంతో సంతోషకరమని, భవిష్యత్తులో మరిన్ని అవారడ్స్ రావాలని ఆకాంక్షించారు.

# క్రీడా ఉత్సవ్ కు అంకురార్పణ

**▸▸ ఘనంగా ప్రారంభమైన స్కై ప్రీమియర్ లీగ్..!!**

**▸▸ ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్..!!**

**▸▸ క్రికెట్ పోటీలను ప్రారంభించిన కూటమి పార్టీల అగ్ర నేతలు...!!**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 13 మనం న్యూస్:** ఇబ్రహీంపట్నం ఏ కాలనీ వేదికగా క్రీడా మహోత్సవానికి అంకురార్పణ జరిగింది. ప్రతిష్టాత్మక ' స్కై ప్రీమియర్ ' లీగ్ క్రికెట్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ముఖ్య అతిధిగా హాజరై ఆయన చేతుల మీదుగా పోటీలను ఘనంగా ప్రారంభించారు. కుక్కపల్లి బ్రాడ్ క్యాస్టింగ్ ప్రవేట్ లిమిటెడ్ స్కై ఈవెంట్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలను కూటమి పార్టీల అగ్రనేతలు అతిధులుగా హాజరై ఘనంగా ప్రారంభించారు. తొలత మంత్రి సత్య కుమార్ యాదవ్ టాస్ వేసి ఇరు జట్లు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా స్ఫూర్తి పెంపొందించడం కోసం స్వయంగా బ్యాటింగ్ చేసి యువత లో నుతనోత్సాహం నింపారు. ఈ కార్యక్రమం లో భాగంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ జన్మదినం పురస్కరించుకొని ముందుగానే కేక్ కటింగ్ చేయించారు. ఈ కార్యక్రమం లో టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షులు అడ్డురి శ్రీరామ్ జనసేన పార్టీ అధికార ప్రతినిధి అక్కల రామ్మోహన్ రావు అతిధులు గా హాజరై మ్యాచ్ లను ఘనంగా ప్రారంభించారు. ఈ మెగా టోర్నీ ప్రారంభోత్సవం లో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్,బీజేపీ జిల్లా కార్యదర్శి మారాసు కృష్ణ మోహన్, కిసాన్ మోర్చా నాయకులు రేగళ్ల రఘునాద్ రెడ్డి, జనసేన నాయకురాలు చింతల లక్ష్మి కుమారి, బీజేపీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షురాలు పయ్యావుల జయ లక్ష్మి, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు..

# రాష్ట్రంలో ఏకీకృత విధానంలో గణేష్ ఉత్సవాలు

**▸▸ 1.70 లక్షల మండపాల్లో నిర్వహణకు ఏర్పాట్లు**

**▸▸ ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు చలసాని ఆంజనేయులు**



**గాంధీనగర్ సెప్టెంబర్ 13 మనం న్యూస్:** రాష్ట్ర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా ఏకీకృత విధానం, ఉచిత విద్యుత్ సౌకర్యంతో వినాయక ఉత్సవాలను నిర్విఘ్నంగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు చలసాని ఆంజనేయులు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి, మా ఆర్ట్స్, మా మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో న్యూ ఇండియా హోటల్ సెంటర్లో ఏర్పాటు అవుతున్న గణేష్ మహోత్సవ మండపంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది 1.40 లక్షల మండపాల్లో వేడుకలు జరగ్గా, ఈసారి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.60 లక్షల నుంచి 1.70 లక్షల మండపాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈ ఉత్సవాల్లో 3 కోట్ల నుంచి 3.70 కోట్ల మంది ప్రజలు పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, హోం మంత్రి, అధికారుల సమన్వయంతో ఈ ఏర్పాట్లు జరిగాయని చెప్పారు. 133 సంవత్సరాల క్రితం బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన స్ఫూర్తితో కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. వేడుకల్లో ఎక్కడా అశ్లీలతకు చోటులేకుండా, రోజూ ఉదయం సాయంత్రం హారతులు, భజనలు, కోలాటాలు, పిల్లలకు క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. విజయవాడ నగర కమిటీ ఉపాధ్యక్షులు చింతల రవి కుమార్ (చంటి) మా మిత్రమండలి చింతల రామారావు(బాబీ) ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ప్రతిరోజూ ఆధ్యాత్మిక సందేశాలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 23వ తేదీన వినాయక నిమజ్జనోత్సవం ఘనంగా జరగనుండగా, భక్తులందరూ విశేషంగా పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, విజయవాడ మహా నగర్ గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు చింతల రవికుమార్ (మా ఆరట్స్ చంటి), అధ్యక్షులు ఎండూరి కిషోర్ పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు జనసేన పిలుపు

**▸▸ హనుమాన్ జంక్షన్‌లో మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ**



**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని హనుమాన్ జంక్షన్ లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్ బాబు చేతుల మీదుగా ముందుగా భక్తులకు, ప్రజలకు ఉచితంగా మట్టి వినాయకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, రసాయనాలతో తయారుచేసిన విగ్రహాల వల్ల చెరువులు, కాలువలు కలుషితమవుతున్నాయని అన్నారు. అందుకే మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు స్వస్తి పలికి మట్టి గణపతులనే పూజిద్దామని అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు షేక్ అహమ్మద్, కడవకొల్లు సుధీర్, మేకల లక్ష్మణ్ మరి గణపతి విగ్రహాలను సమకూర్చారు. కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లాడిశెట్టి నాగేశ్వరరావు, వడ్డి శేఖర్, పరుచూరి సుజిని, కొలసాని శివలీల, మద్దా జయరాణి,, సింగవరపు సూర్యావతి, బండారు లక్ష్మీ ప్రసన్న, యనమల లలిత, రామిశెట్టి వరప్రసాద్, కందుకూరి శ్రీధర్, శేషం పవన్ , వడ్డి భార్గవ్, వడ్డి అశోక్,పుషదపు వీర వెంకయ్య, బైరా చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# 16లోగా కొత్త పింఛన్లకు దరఖాస్తులు చేసుకోవాలి



**గుంటూరు, సెప్టెంబర్ 13 : (మనం న్యూస్ ప్రతినిధి )**కొత్త పింఛన్లకు ఈ నెల 16వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. దరఖాస్తు చేయుటకు గడువు ఇంకా రెండు రోజులు మాత్రమే ఉందని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర బలహీన వర్గాలకు కొత్తగా అవకాశం కల్పిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద తాజాగా దరఖాస్తు చేసుకొనుటకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని గుర్తుచేశారు.16వ తేదీ వరకు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. 17వ తేదీ నుండి 21వ తేదీ వరకు సంబంధిత శాఖల అధికారులు - జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషన్, మత్స్యశాఖ, సాంఘీక సంక్షేమ శాఖ, చేనేత - జౌళి శాఖ అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారని చెప్పారు. వృద్ధాప్య పింఛనుకు వయస్సు ధృవీకరణ (ఆధార్) పత్రం, వితంతు పింఛనుకుభర్త ఆధార్, మరణ ధృవీకరణ పత్రాలు, ఒంటరి మహిళా పింఛనుకు అవివాహిత కేటగిరిలో సంబంధిత తహశీల్దారుజారీ చేసిన ఒంటరి మహిళా ధృవీకరణ పత్రం, వివాహిత కేటగిరిలో కోర్టు ఆదాలత్ ద్వారా జారీ చేసిన విడాకుల ధృవీకరణ పత్రం, దివ్యాంగుల పింఛనుకు 40 శాతం అంతకు మించి అంగవైకల్యము కలిగిన సదరం ధృవీకరణ పత్రంను దరఖాస్తుతో పాటు స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలలో 16వ తేదీలోగా సమర్పించాలని తెలిపారు. డప్పు కళాకారులు ప్రస్తుతం స్వయం ధృవీకరణ పత్రంను సమర్పిస్తే సరిపోతుందని చెప్పారు.అన్ని స్థాయిల్లో పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన లబ్ధిదారులకు దశలవారీగా పింఛన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తు సేవ అందుబాటులో ఉందన్నారు.

# భారత పర్యాటక, ఆతిథ్య రంగంలో విశిష్ట సేవలకు ఐఏటీవో హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు 2026



**విజయవాడ , 13 సెప్టెంబర్ మనం న్యూస్ :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్ (ఐఅఖీ), హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఅఐ) అధ్యక్షుడు మరియు రాడిసన్ హోటల్ గ్రూప్ - దక్షిణాసియా చైర్మన్ శ్రీ ఓఆ కచ్రూ ను విశాఖపట్నంలో జరిగిన 41వ ఐఅఖీ వార్షిక సదస్సులో ప్రతిష్ఠాత్మకమైన హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుతో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కె.రామ్మోహన్ నాయుడు సత్కరించారు. పర్యాటక మరియు ఆతిథ్య రంగ వ్యవస్థ ఉన్నతికి ఆయన దశాబ్దాల నాయకత్వం మరియు సేవలను గౌరవిస్తూ ఈ పురస్కారం అందచేసారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఢిల్లీ, కర్ణాటక, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మధ్యప్రదేశ్, గోవా తదితర రాష్ట్రాల పర్యాటక శాఖ మంత్రులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, ఐఅఖీ అధ్యక్షుడు శ్రీ రవి గోసైన్ మరియు సంస్థ సీనియర్ నాయకులు హాజరయ్యారు. భారత పర్యాటక మరియు ట్రావెల్ రంగములలో ప్రభావంతమైన కృషిచేసిన వ్యక్తులను ఐఅఖీ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డుతో సత్కరిస్తారు.గౌరవిస్తుంది. భారతదేశం 2047 లక్ష్యాలను సాధించే దిశగా పర్యాటక మౌలిక సదుపాయాలు మరియు ఆతిథ్య సామర్థ్యాన్ని విస్తరించడంపై పరిశ్రమ దృష్టి సారించిన సమయంలో శ్రీ కచ్రూ ఈ పురస్కారం పొందారు. ఏఅఐలో, అలాగే భారతదేశంలోని అతిపెద్ద హోటల్ గ్రూపుల్లో ఒకటైన రాడిసన్ హోటల్ గ్రూప్లో కీలక పాత్ర పోషించారు. భారతదేశ పర్యాటక మరియు ఆతిథ్య రంగ వ్యవస్థను బలోపేతం చేయడంలో శ్రీ కచ్రూ దశాబ్దాలుగా అందించిన నాయకత్వాన్ని ఈ గుర్తింపు ప్రతిబింబిస్తుంది. 1998లో రాడిసన్ హోటల్ గ్రూప్లో చేరినప్పటి నుంచి, దక్షిణాసియాలో సంస్థ వ్యాపార విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. శ్రీ కచ్రూ ప్రస్తుతం హోటల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా, టూరిజం హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గవర్నింగ్ మెంబర్గా, ఇఐఐ టూరిజం కమిటీ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. ఆయన రాష్ట్ర పర్యాటక సంస్థలు మరియు ఐఏకన్యూఢిల్లీ బోర్డు సభ్యునిగా బాధ్యతలు నిర్వహించారు.



గౌరవ పురస్కారం పొందిన సందర్భంగా శ్రీ ఓఆ కచ్రూ మాట్లాడుతూ, ఐఅఖీ హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు 2026ను గౌరవప్రదంగా స్వీకరిస్తున్నాను అన్నారు. ఈ స్థాయికి నేను రావటంలో సహకరించిన సహచరులు, సంస్థలు మరియు వృత్తి నిపుణుల భాగస్వామ్యంతో ఈ గౌరవ పురస్కారం నేను పంచుకుంటున్నాను అన్నారు. ఈ రోజు భారతదేశ పర్యాటక మరియు ఆతిథ్య రంగం సాంకేతికత, సుస్థిరత మరియు భారతీయ ఆతిథ్యంలోని ప్రామాణికతలతో స్వర్ణ దశాబ్దం ప్రారంభానికి మనం చేరువలో ఉన్నాం. మన ముందున్న అవకాశం కేవలం అభివృద్ధికే పరిమితం కాదు. ప్రపంచ స్థాయి ఆతిథ్యం అంటే ఏమిటో, మన స్వంత విలువలు మరియు విధానాల ఆధారంగా పునర్నిర్వచించే అవకాశం మనకు ఉంది. అన్నారు .ఈ రంగంలోకి అడుగుపెడుతున్న యువ వృత్తి నిపుణులు సంప్రదాయ పద్ధతులకు అతీతంగా ఆలోచించే ధైర్యం ఉన్నవారిదే భవిష్యత్తు అన్నారు.- నైపుణ్యాభివృద్ధిని జీవితాంతం కొనసాగించాల్సిన ప్రక్రియగా, సుస్థిరతను రాజీపడలేని అంశంగా, ప్రపంచ పోటీతత్వాన్ని అనుకరణ ద్వారా కాకుండా అత్యుత్తమత ద్వారా సాధించాల్సిన లక్ష్యంగా చూసే వారిదే భవిష్యత్తు. ఈ మార్గంలో మీతో కలిసి నడవడానికి తరతరాలకు ఉపయోగపడే పరిశ్రమను నిర్మించడానికి నేను కట్టుబడి ఉన్నాను అని శ్రీ కచ్రూ తెలిపారు. దూరదృష్టితో కూడిన నాయకత్వం, వృత్తిపరమైన నైపుణ్యం మరియు భారతీయ పర్యాటక, ఆతిథ్య రంగాన్ని అభివృద్ధి చేయాలనే ధృఢ సంకల్పంతో శ్రీ కచ్రూ కృషి చేస్తున్నారని ఐఅఖీ పేర్కొంది. ఆయన మార్గదర్శకత్వం చిరస్థాయి వారసత్వాన్ని మిగిల్చిందని, పరిశ్రమలోని అనేక తరాల వృత్తి నిపుణులకు స్ఫూర్తినిచ్చిందని ఐఅఖీ తెలిపింది.

# నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



**వెబ్ డెవలపర్, టూ వీలర్ మెకానిక్ కోర్సుల్లో శిక్షణ**

**అనంతరం ఉపాధి అవకాశాలు**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ: సెప్టెంబర్ 13,(మనం న్యూస్):** నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) కింద ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, రమేష్ హాస్పిటల్ ఎదురు ఉన్న స్కిల్ హబ్లో ఇంటర్మీడియేట్, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులకు వెబ్ డెవలపర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణను ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10వ తరగతి, ఐటిఐ డిప్లొమా లేదా ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన అభ్యర్థులకు టూ వీలర్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణ అనంతరం ప్రముఖ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించచన ున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి మరియు అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల సెప్టెంబర్ 18 వ తేదీ లోపుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వెంకట్ - 9912137965, కిశోర్ - 9985759304 నంబర్లను సంప్రదిం చాలని సూచించారు. యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత నైపుణ్య శిక్షణ పొందడంతో పాటు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందాలని సూచించారు.

# ప్రకాశం, రాయలసీమలను కొనసీమగా మార్చగల నాయకుడు వాటర్ మ్యాన్, అపరభగీరథుడు నారా చంద్రబాబు నాయుడు

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 13 (మనం న్యూస్ ప్రతినిధి)** ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో 10 బస్సుల్లో 450 మంది నాయకులు, కార్యకర్తల సందర్శన.ప్రకాశం, రాయలసీమలను కొనసీమగా మార్చగల నాయకుడు వాటర్ మ్యాన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, అపరభగీరథుడు నారా చంద్రబాబు నాయుడు అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు,నాయకులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక ప్రోత్సాహకంగా వెలిగొండ ప్రాజెక్టు, శ్రీశైలం దేవస్థానం పర్యటనను ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీనివాసరావుపేటలోని క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి జెండా ఊపి 10 బస్సులను ప్రారంభించారు. ఈ పర్యటనలో సుమారు 450 మంది కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టును సందర్శించిన కార్యకర్తలు ప్రధాన టన్నెల్ ప్రాంతం, నీటి ప్రవాహ మార్గాలు,ఫీడర్ కాలువలు, 40 కిలోమీటర్ల ప్రధాన కాలువ వ్యవస్థతో పాటు ప్రాజెక్టు నిర్మాణ విశేషాలను పరిశీలించారు.కరువు ప్రాంతాలకు జీవనాడిగా మారిన ఈ ప్రాజెక్టు ద్వారా చేరుతున్న నీటి ప్రవాహాన్ని ప్రత్యక్షంగా వీక్షించి ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం శ్రీశైలం క్షేత్రంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పార్టీ అధినేత,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూపొందించిన డోర్ టు డోర్ కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యకర్తలు అత్యంత బాధ్యతతో నిర్వహించారని తెలిపారు.కేవలం 20 రోజుల్లోనే కార్యక్రమాన్ని పూర్తి చేసి రాష్ట్రవ్యాప్తంగా 7వ స్థానంలో నిలవడం పశ్చిమ నియోజకవర్గ టీడీపీ శ్రేణుల నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు.డోర్ టు డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతగా ఈ పర్యటన ఏర్పాటు చేశామని, అభివృద్ధి అంటే కేవలం మాటలు కాదని,ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకొచ్చే మహత్తర ప్రాజెక్టులేనని పేర్కొన్నారు. అందుకే అమరావతి కాకుండా వెలిగొండ ప్రాజెక్టును సందర్శనకు ఎంపిక చేశామని తెలిపారు.వెలిగొండ ప్రాజెక్టు అనేది కేవలం ఒక నీటిపారుదల ప్రాజెక్టు కాదని, అది చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పట్టుదల, ప్రజల పట్ల ఉన్న అంకితభావానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 'వెలిగొండ అనేది ఒక సాధారణ ప్రాజెక్టు కాదు.ఇది మూడు దశాబ్దాల కల, వేలాది కుటుంబాల ఆశల ప్రతిరూపం. ఈ ప్రాజెక్టు వెనుక స్థానిక ప్రజల త్యాగం, ఇంజనీర్ల అంకితభావం, ప్రభుత్వ నిబద్ధత, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు సంకల్పం ఉన్నాయి. అందుకే ప్రతి తెలుగు వ్యక్తి జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రాజెక్టును సందర్శించాలి' అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.రాష్ట్ర భవిష్యత్తును మార్చగలిగే ప్రాజెక్టుల వెనుక ఉన్న కృషి, సంకల్పాన్ని తెలుసుకునే అవకాశం లభించిందని పేర్కొన్నారు. ఈ పర్యటన తమలో మరింత ఉత్తేజాన్ని నింపిందని,పార్టీ బలోపేతం కోసం రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తామని తెలిపారు.

# ప్రజలకు చేరువగా పోలీసులు.. పల్లెనిద్ర



**గుంటూరు సెప్టెంబర్ :13 (మనం న్యూస్ ప్రతినిధి):** పల్లెనిద్రతో ప్రజల సమస్యల పరిష్కారం,నేరాల నియంత్రణకు చర్యలు: జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచడమే పల్లెనిద్ర ప్రధాన ఉద్దేశ్యం.గ్రామస్థుల సమస్యలను తెలుసుకుని,చట్టాలపై అవగాహన కల్పిస్తూ నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు.సైబర్ నేరాలపై అవగాహనతో పాటు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచనలు.గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని పోలీసులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక సీఐలు,ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి ఎంపిక చేసిన గ్రామాలు,పట్టణ ప్రాంతాల్లో రాత్రి బస చేసి ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు.దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలువూరు,తుళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అనంతవరం, కాకుమాను పరిధిలోని వల్లూరు, కొల్లిపర పరిధిలోని చిముడిపాడు,పొన్నూరు రూరల్ పరిధిలోని కసుకర్రు, తెనాలి వన్ టౌన్ పరిధిలోని చినరావూరు రైల్వే స్టేషన్ ప్రాంతం, లాలాపేట వడ్డెరగూడెం,తాడేపల్లి 13వ వార్డు రోడ్డు, మహానాడు, నగరంపాలెం వికలాంగుల కాలనీ,పట్టాభి పురం, నేతాజీనగర్,కొత్తపేట లోని వెంకటాద్రిపేట,తెనాలి 3 టౌన్ పరిధిలోని సుల్తానాబాద్, ముట్లూరు,వెనిగండ్ల, కొమ్మూరు,కారంపూడిపాడు, కొర్నేపాడు, జొన్నలగడ్డ, రేవేంద్రపాడు,వల్లభాపురం, చినకొండపాడు,కొప్పర్రు, కాకుమాను,సంగం జాగర్లమూడి,నాగులపాడు, పెదగొట్టిపాడు,ఐతానగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామస్థులు,గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలతో సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితి,నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ప్రజలకు అవగాహన.నేరాలపై అప్రమత్తత.పల్లెనిద్రలో భాగంగా సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, మాదకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న విషయాలకు ఆవేశాలకు లోనుకాకుండా,సమస్యలను చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ప్రజల సహకారంతో నేరాలను ముందుగానే గుర్తించి నివారించడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలతో మరింత భద్రత.గ్రామాల్లో భద్రతను పెంచేందుకు ఇళ్లు, వ్యాపార సంస్థలు, దేవాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు.నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయని వివరించారు.గ్రామస్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు పోలీసులతో నిరంతరం సమన్వయంతో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

# ఖైరతాబాద్ వినాయకుడి మాదిరిగా 'డూండీ' గణపతి





- పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా
- ఆరేళ్ల నుంచి 72 భారీ అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు
- ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలి
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

(విజయవాడ-మనం బ్యూరో): ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలకు మాదిరిగా డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. సంప్రదాయాలను పాటిస్తూ, పర్యావరణానికి ఎటువంటి హానీ కలగకుండా ఆరేళ్ల నుంచి 72 భారీ అడుగుల భారీ వినాయక విగ్రహం ఏర్పాటు చేస్తూ వస్తున్న డూండీ గణేశ్ సేవా సమితి సభ్యులను అభినందించారు. ప్రజలంతా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. విజయవాడలోని విద్యాధర పురంలో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 72 అడుగుల చముఖ వరసిద్ధి మహా గణపతి భారీ విగ్రహం ఆగమన వేడుకను మంత్రి సవిత ఆదివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నవ్యాంధ్ర ప్రదేశ్ ఏర్పడిన తరవాత ఆరేళ్ల నుంచి భారీ ఎత్తున వినాయక నవరాత్రి ఉత్సవాలను డూండీ గణేశ్ సేవా సమితి నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఖైరతాబాద్ వినాయక ఉత్సవాలను ధీటుగా విజయవాడలో నిర్వహించడం అభినంద నీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... డూండీ గణేశ్ సేవా సమితి మహిళా ప్రతినిధులతో కలిసి కోలాటం ఆడి సందడి చేశారు. సంప్రదాయ నృత్యకళాకారిణులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, కార్పొరేషన్ చైర్మన్లు డూండీ రాకేశ్, పేరేపీ ఈశ్వరరావు, సినీ నిర్మాత, ప్రముఖ పారిశ్రామికవేత్త అంబికా కృష్ణ, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

- అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతిని ఆకాంక్షించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ,సెప్టెంబర్,13,(మనం న్యూస్):** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులతో జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శాంతి, సౌభాగ్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వినాయక చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పర్యావరణహిత వినాయక ప్రతిమలను పూజించాలని కలెక్టర్ కోరారు. గణనాథుని ఆశీస్సులతో ఎన్టీఆర్ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరికీ సుఖశాంతులు, సౌభాగ్యం కలగాలని ఆకాంక్షించారు.

## పర్యావరణాన్ని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- లయన్స్ ప్రెసిడెంట్ మత్తి సాంబశివరావు

**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 13 ( మనం న్యూస్):** వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు, రసాయన రంగులు లేని సహజ మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దామని లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మత్తి సాంబశివరావు అన్నారు. హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియుజేస్తూ 270 మట్టి వినాయక ప్రతిమలను, కూరగాయలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అక్కినేని రాఘువేంద్రరావు, కోశాధికారి మత్తి రాంబాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు కలపాల రంగారావు, డిస్ట్రిక్ట్ చైర్మన్ కళ్లేపల్లి నారాయణరావు, గూడపాటి రత్న శేఖర్,నండూరి సత్య వెంకటేశ్వరశర్మ,అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర, చలసాని వెంకటేశ్వర రావు, వీరమాచినేని నాగయ్య, బోయపాటి పూర్ణచంద్రరావు, ఇమ్మిడిశెట్టి ప్రసాద్, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.



## ప్రస్తుత వాతావరణ ప్రభావం దృష్ట్యా గ్రామాలలో ప్రజలు, కార్యదర్శులు అప్రమత్తంగా మెలగాలి



- జిల్లా పంచాయతీ అధికారిణి :ఏ ధనలక్ష్మి
- జిల్లా ప్రజలకు ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు
- లోతట్టు గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

మచిలీపట్నం, సెప్టెంబర్ 13( మనం న్యూస్): ప్రస్తుత భారీ వర్షాలు మరియు ముసురు వాతావరణం నేపథ్యంలో, కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంత పంచాయతీ కార్యదర్శులతో పాటు ప్రజలందరూ అప్రమత్తంగా మెలగాలని జిల్లా పంచాయతీ అధికారి ఏ. ధనలక్ష్మి కోరారు. జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు ఆమె తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ క్రింది జాగ్రత్తలు పాటించాలని సూచించారు.తాగునీటి విషయంలో జాగ్రత్త: ముసురు వల్ల తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి ప్రజలందరూ నీటిని బాగా కాచి, చల్లార్చి వడపోసుకున్న తర్వాతే తాగాలి.శిథిలావస్థకు చేరిన ఇళ్లు: పాత మట్టి ఇళ్లు లేదా శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండటం ప్రమాదకరం. అలాంటి వారు వెంటనే సచివాలయ సిబ్బందిని సంప్రదించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి.విద్యుత్ స్తంభాలకు దూరం: వర్షానికి తడిసిన విద్యుత్ స్తంభాలు, ఊడిపోయిన వైర్ల దరిదాపుల్లోకి వెళ్లవద్దు. పశువులను కూడా విద్యుత్ స్తంభాలకు కట్టేయకూడదు.లోతట్టు ప్రాంతాలు కాజ్వేలు: వాగులు, వంకలు పొంగిపొర్లుతున్న సమయంలో రోడ్లపై ప్రవహించే నీటిని దాటడానికి ప్రయత్నించవద్దు. రైతులు, పశువుల కాపరులు చెట్ల కింద ఆశ్రయం పొందకూడదు.ఆరోగ్య సంరక్షణ: చల్లని వాతావరణం వల్ల సీజనల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉంది. జ్వరం లేదా ఒంటి నొప్పులు వస్తే వెంటనే స్థానిక విలేజ్ క్లినిక్ లేదా వైద్యాధికారులను సంప్రదించాలి.గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అందరూ ప్రజల కు అందుబాటులో ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలకు నిరంతరం సహాయక చర్యలు అందించాలని కోరారు..ఈ భారీ వర్షాలు, ముసురు నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు అందరూ తక్షణమే రంగంలోకి దిగాలని ఆమె ఆదేశించారు.గ్రామాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా కింది చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు..డ్రైనేజీల పూడికతీత: గ్రామాల్లోని అంతర్గత మురుగు కాలువల్లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తను, పూడికను తక్షణమే తొలగించి డ్రైనేజీల పారుదలకు వీలుగా అత్యవసర చర్యలు చేపట్టాలి.బ్లీచింగ్ చల్లడం: వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమల నివారణకు, బ్యాక్టీరియా చేరకుండా బ్లీచింగ్ పౌడర్ లేదా యాంటీ-లార్వా ద్రావణాలను పిచికారీ చేయించాలి. పంచాయతీ సిబ్బంది అలర్ట్: సచివాలయం పరిధిలోని డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు మరియు పారిశుధ్య కార్మికులు,క్లాప్ మిత్రాస్ అందరూ సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలను పర్యవేక్షించాలి.విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ధనలక్ష్మి హెచ్చరించారు

# మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలి



**▸ సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకీటి అరుణ్ కుమార్**

**గుంటూరు, సెప్టెంబరు13 (మనం న్యూస్ ప్రతినిధి) :** గుంటూరు కొత్తపేటలోని సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్ వద్ద సిపిఐ గుంటూరు నగర సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకీటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.కోట మాల్యాద్రి మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భారీ విగ్రహాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారు చేసిన విగ్రహాలు,రసాయన రంగుల వినియోగం పెరగడం వల్ల నిమజ్జనం అనంతరం నీటి కాలుష్యం అధికమవుతోంద న్నారు. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా సిపిఐ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆకీటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ వినాయక చవితి పండుగను ప్రజలందరూ సంతోషంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా అధిక శబ్దాలతో సౌండ్ సిస్టమ్స్ వినియోగించడం,లేజర్ లైట్లను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. నిమజ్జన కార్యక్రమాలకు పోలీసుల అనుమతులు తీసుకోవడంతో పాటు నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.అధిక శబ్దాలు,లేజర్ లైట్ల వినియోగంపై సంబంధిత ప్రభుత్వ శాఖలు, పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు.నగర ప్రజలంతా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నగర సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నూతలపాటి చిన్న, జంగాల చైతన్య,ది గుంటూరు కార్పెంటర్స్ అసోసియేషన్ నాయకులు కాయల రామారావు, డేగల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

**▸ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**



**గుంటూరు, సెప్టెంబర్ 13 (మనంప్రతినిధి):** జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ.వేడుకల ప్రశాంత నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా పోలీసుల ముందస్తు చర్యలు. సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక సమావేశాలు,సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సెలింగ్ డీజేలకు అనుమతి లేదు - సౌండ్ సిస్టమ్స్, ట్రాఫిక్, ప్రజా భద్రత నిబంధనలు తప్పనిసరి.14.09.2026న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించుకుంటున్న గుంటూరు జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి వేడుకలు జిల్లావ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టింది.వేడుకల నేపథ్యంలో సున్నితమైన గ్రామాలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ,స్థానిక పెద్దలు,ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు, సమస్యాత్మక వ్యక్తులతో పోలీసు అధికారులు సమావేశాలు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపన ప్రదేశాలను ముందుగానే పరిశీలిస్తూ, నిర్వాహకులతో సమన్వయం చేస్తున్నారు. ఎటువంటి వివాదాలకు అవకాశం లేకుండా అన్ని వర్గాలతో సమన్వయం చేసుకుంటూ వేడుకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకుంటు న్నారు.వేడుకల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సౌండ్ సిస్టమ్స్ వినియోగం, ట్రాఫిక్ నియంత్రణ, విగ్రహాల ప్రతిష్ఠాపన, ఊరేగింపులు, ప్రజా భద్రతకు సంబంధించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతలు ,మత సామరస్యం మరియు ప్రజా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసుల నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు.వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, పరస్పర గౌరవంతో ప్రశాంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఏవైనా అవాంఛనీయ పరిస్థితులు, వివాదాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో వినాయక చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

# వీధి దీపాల సమస్యలకు 48 గంటల్లో పరిష్కారం: నగర కమిషనర్

**గుంటూరు నగరపాలక సంస్థ సెప్టెంబర్ :13 (మనం న్యూస్ ప్రతినిధి )**గుంటూరు నగరంలో వీధి దీపాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలకు రాత్రి వేళల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా,వీధి దీపాల సమస్యలను ఫిర్యాదు అందిన 48 గంటలలోగా వేగవంతంగా పరిష్కరించడానికి తగిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,నగరంలో ఇప్పటికే రోజువారీ కార్యాచరణ ప్రణాళిక మేరకు సమస్యలు పరిష్కారం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, అలాగే వీధి దీపాలు వెలగకపోవడం లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రజలు వెంటనే జిఎంసి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా జిఎంసి కాల్ సెంటర్ మరియు వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు.సమస్య పరిష్కారం కోసం నగరప్రజలు జిఎంసి కాల్ సెంటర్ నంబర్ 0863 2345103 కి నేరుగా కాల్ చేసి గానీ, లేదా 98499 08391 నంబర్కు వాట్సాప్ ద్వారా గానీ సమాచారం అందించి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. న్నారు.ఈ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూసేందుకు,వీధి దీపాలకు సంబంధించిన అవసరమైన సామాగ్రిని ఇప్పటికే ముందస్తుగా కొనుగోలు చేసి పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి 48 గంటల సమయ పరిమితిలో సమస్యను పరిష్కరించడానికి డివిజన్ల వారీగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని




ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామని, కాబట్టి నగర ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# గణేష్ మండపాల వద్ద పోలీసుల వినూత్న అవగాహన



**గుంటూరు సెప్టెంబర్ :13 (మనం న్యూస్ ప్రతినిధి )** గణేష్ చతుర్థి సందర్భంగా లాలాపేట పోలీసుల, ఆధ్వర్యంలో వినూత్న అవగాహన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గణేష్ మండపాలకు వచ్చే భక్తులు, ప్రజలకు సామాజిక భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి గణేష్ మండపం వద్ద ప్రత్యేక అవగాహన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తత మహిళల భద్రత, రక్షణ మరియు సహాయ సేవలు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు - ఖ్చిడ్రా్్ౖట్ ౄటఊఖులాక్డ్ హౌస్ మానిటరింగ్ అవగాహన.అత్యవసర సమయంలో డయల్ 112 వినియోగం.ప్రజల భద్రతకు సంబంధించిన ఇతర ముఖ్యమైన అంశాలువంటి అంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో ఫ్లెక్సీల ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు.గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించడంతో పాటు, ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు, ప్రజలకు నేరాల నివారణ, మహిళల భద్రత, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత,అత్యవసర సేవల వినియోగంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని లాలాపేట పోలీసులు తెలిపారు. ఉత్సవాల ఆనందంతో పాటు.. భద్రతపై అవగాహన కూడా అవసరం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని లాలాపేట పోలీసులు కోరారు.

# జాతీయ లోక్అదాలత్ లో సత్తా చాటిన హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్

**▸ కేసుల పరిష్కారంలో కృష్ణాజిల్లాలో ప్రథమ స్థానం**

**హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 13 ( మనం న్యూస్ ):** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధిక కేసులను పరిష్కరించి కృష్ణాజిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 3345 కేసులు శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించబడ్డాయి. సాధారణ కేసులు 73, పెట్టీ కేసులు 3246, తాగి వాహనం నడిపిన కేసులు 26 కేసులు, వీరికి ఒక్కొక్కరికి 10,000 వేల రూపాయలు జరిమానా విధించారు.ఈ కేసులన్నీ నూజివీడు 2 వ ఏ జే ఎఫ్ సి ఎం కోర్టులో 15 వ అడిషనల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జ్ డి.సత్యవతి పరిష్కరించారు.. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేసిన హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ మైనం శ్రీనివాస్ తో పాటు సిబ్బందిని న్యాయమూర్తి తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.తక్కువ సమయంలో ఎక్కువ కేసులు పరిష్కరించడం ద్వారా ప్రజలకు,కోర్టుకు సమయం ఖర్చు ఆదా అయినట్లు అవుతుంది.

# తంగిరాల సౌమ్య సమక్షంలో టీడీపీలోకి 12 వైసీపీ కుటుంబాలు



**చందర్లపాడు,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** చందర్లపాడు మండలం, పాత బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన 12 కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం నందిగామలోని తన కార్యాలయంలో కూటమి నేతలతో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి ఈ చేరికలే నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుండగా, నందిగామ నియోజకవర్గంలో కూడా అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పార్టీలో చేరిన కుటుంబాలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత కల్పిస్తూ గ్రామస్థాయిలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయడానికి అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని సౌమ్య పేర్కొన్నారు. పాత బెల్లంకొండవారిపాలెంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 12 కుటుంబాల చేరికతో గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలపడిందని కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# 14న జిఎంసి పీజీఆర్ఎస్ రద్దు: నగర కమిషనర్



**గుంటూరు నగరపాలక సంస్థ, సెప్టెంబర్13 (మనం న్యూస్ ప్రతినిధి):** వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 14వ తేదీ (సోమవారం) గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ వెల్లడించారు. పండుగ సెలవు కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని, అర్జీదారులు మరియు ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని ఆయన కోరారు.

# తుర్లపాడు అభివృద్ధికి మరో ముందడుగు



- రూ.3.84 కోట్లతో రహదారి పునర్నిర్మాణానికి శంకుస్థాపన..
- కూటమి ప్రభుత్వ హయాంలో గ్రామీణ రహదారుల అభివృద్ధికి పెద్దపీట
- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**చందర్లపాడు,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** చందర్లపాడు మండలం తుర్లపాడు గ్రామంలో గ్రామీణ రహదారి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. చందర్లపాడు నుంచి కంచల గ్రామానికి తుర్లపాడు మీదుగా వెళ్లే రహదారి పునఃనిర్మాణ పనులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కూటమి నేతలు, అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.384.00 లక్షలు (రూ.3.84 కోట్లు) అంచనా వ్యయంతో ఈ రహదారి పునఃనిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఖఖ (జ్బ్వాజీ) గ్రాంట్ ద్వారా నిధులు సమకూరుతున్నాయి. తుర్లపాడు మీదుగా చందర్లపాడు-కంచల గ్రామాలను కలిపే ఈ రహదారి పునర్నిర్మాణంతో ప్రజల రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామీణ ప్రజలు ప్రయాణించేందుకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు అవసరమైన రహదారులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగావు నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు నిధులు తీసుకువచ్చి పనులను వేగంగా పూర్తి చేయడమే తమ ధ్యేయమని సౌమ్య తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు మాటల్లో కాదు.. చేతల్లో కనిపిస్తున్నాయి. ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి, ప్రతి కుటుంబానికి మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే మా లక్ష్యం అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లాల్ బహుదూర్ లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు,కూటమి నేతలు, స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వేదాద్రి లో బోధానందస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం



**జగ్గయ్యాపేట,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** శ్రావణ మాస అమావాస్య సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం వేదాద్రి శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో అంబారుపేట శ్రీ సద్గురుబోదానంద స్వామి చారిటబుల్ ట్రస్ట్ వారు సుమారు 200 మందికి పైగా ప్రజలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బొగ్గవరపుసీతారామకృష్ణ , దూపు గుంట్ల రామ్మోహన్ రావు, కర్నాటి శరత్ బాబు, అడ్డగిరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఏడవ రోజుకు హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు




**నందిగామ,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** రామలింగేశ్వర స్వామి వారి ఆలయ కోనేరు పుష్కరిణి ఆక్రమణ తొలగించాలని హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడవ రోజుకు చేరుకున్నాయి.. నందిగామ పట్టణం శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్షలో మెల్లెం పూడి గోపాలకృష్ణ, బొల్లా పూర్ణచంద్రావులకు హిందూ సంఘాల సభ్యులు నూతక్కి విజయ్, తులసీ కృష్ణ, ఈ వూరి సురేష్ లకు దండ దీక్షల ప్రారంభించారు.. కోనేరు పుష్కరిణి ఆక్రమణల తొలగింపు పై అధికారులు నిర్లక్ష్యం వీడి.. హైకోర్టు తీర్పును గౌరవిస్తూ స్వామివారి కోనేరు పుష్కరిణి ఆక్రమణ తొలగింపు పై వెంటనే చర్యలు చేపట్టాలని హిందూ సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు.. ఈ దీక్ష కార్యక్రమంలో నెలకుదిటి కాశీ విశ్వేశ్వర రావు,బండారు కేదార్నాథ్ శర్మ, కొత్త సాంబశివరావు, రామిరెడ్డి కోటి సూర్యం, జెమినీ నాగమల్లేశ్వరావు, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ధార్మిక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# వైసీపీ విధ్వంస రాజకీయాలకు చెక్..



- కూల్చిన శిలాఫలకానికి బదులు.. అభివృద్ధి శిలాఫలకం!
- కూటమి పాలనలో మళ్లీ రోడ్డు పునర్నిర్మాణానికి శ్రీకారం. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**నందిగామ,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** అభివృద్ధిని అడ్డుకున్న గత పాలనకు చరమగీతం పాడుతూ.. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం:అడవిరావులపాడు-కోనాయపాలెం రహదారిలోని లింగాలపాడు క్రాస్ రోడ్ వద్ద పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సి.ఏ.డి. ఆర్ బిటి రోడ్డు నుంచి చెరువుకొమ్ముపాలెం వరకు రహదారి పునర్నిర్మాణ పనులకు అధికారులు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శంకుస్థాపన చేశారు. ఈ రహదారి పునర్నిర్మాణానికి రూ.3.71 కోట్ల అంచనా వ్యయంతో ఖఖ (జ్బ్వాజీ) నిధులు కేటాయించారు. రహదారి అభివృద్ధితో పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు.

**అభివృద్ధి చేస్తే టీడీపీ.. కూల్చితే వైసీపీ.. మళ్లీ నిర్మిస్తే కూటమి!**

గతంలో 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకుని శిలాఫలకాన్ని ఏర్పాటు చేశామని, అయితే అనంతరం వైసీపీ పాలనలో రాజకీయ కక్షతో కొందరు నేతలు ఆ శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని తంగిరాల సౌమ్య ఆవేదన వ్యక్తం చేశారు. శిలాఫలకాలు కూల్చడం అభివృద్ధి కాదు.. ప్రజలకు ఉపయోగపడే రోడ్లు, వంతెనలు, తాగునీరు, ఆసుపత్రులు నిర్మించడమే నిజమైన ప్రజాసేవ అని ఆమె స్పష్టం చేశారు. గత పాలనలో రాజకీయ విధ్వంసానికి గురైన ప్రాంతాల్లో సైతం కూటమి ప్రభుత్వం తిరిగి అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. ఎవరు ఏం కూల్చినా.. ప్రజల కోసం నిర్మాణం ఆపేది లేదని, నందిగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్లగిరి గట్టుపై ప్రత్యేక పుష్ప అలంకరణలో భూ వరాహ స్వామి

- గోవింద నామస్మరణతో మారుమోగిన పల్లగిరి కొండ



**నందిగామ,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** నందిగామ మండలం గొల్లగిరి గట్టుపై వేంచేసి ఉన్న శ్రీ భూ వారా స్వామి జన్మ తిరునక్షత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు పరాశరం పవన్ కుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజ, భూ వరాహ స్వామి వారికి సుగంధ ద్రవ్యాలు పంచామృతాలతో తిరువంజనం, స్వామివారికిప్రత్యేక పుష్పాలంకరణలు, వైఖానస సాంప్రదాయ పద్ధతిలో శ్రీ భూవరస్వామి వారికి అష్టోత్తర విశేష అర్చనలు వేదోక్తంగా జరిగాయి.. ఈ పవిత్ర స్వామి వారి కార్యక్రమాలు పాల్గొన్న పలు గ్రామాల భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది..

# ఎన్నికలు భాగంగా పోలింగ్ స్టేషన్లు డ్రాఫ్ట్ పబ్లికేషన్



- ఎంపిడివో. హెచ్ వి యం. ప్రసాదరావు

**నందిగామ,సెప్టెంబర్ 13(మనం న్యూస్):** ఆదివారం రోజున నందిగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వి యస్ హెచ్ వి యం. ప్రసాదరావు.రంగా వారు ఎంపిటీసీ/జెడ్పిటీసీ ఎన్నికలు 2026 లో భాగముగా పోలింగ్ స్టేషన్లు డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేసిన సందర్భముగా సదరు పోలింగ్ స్టేషన్లలో ఏమైనా అభ్యంతరములు ఉన్నట్లు ఐతే సదరు అభ్యంతరములు స్వీకరించు నిమిత్తం మండల పరిషత్ కార్యాలయము నందు అందుబాటులో ఉండడం అయినది అని వి యస్ హెచ్ వి యం.ప్రసాదరావు మండల పరిషత్ అభివృద్ధి అధికారి తెలియచేశారు.



# గణేష్ ఉత్సవాల్లో...
# పర్యావరణ హితానికి పెద్దపీట

## ప్రకృతిని కాపాడుతూ వినాయక చవితి జరుపుకుందాం

### జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



విజయవాడ,సెప్టెంబర్,13, (మనం న్యూస్) :పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పిలుపునిచ్చారు. వినాయక చవితి సందర్భంగా మట్టి, పర్యావరణహిత గణేష్ ప్రతిమలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణ మండలి, పర్యాటక, డీఆర్డీఏ, వ్యవసాయ, పాఠశాల విద్య తదితర శాఖలతో పాటు పర్యావరణ మానవ సమాజ భద్రత, బాధ్యత ఫౌండేషన్, వన్ ఎర్త్ వన్ లైఫ్ తదితర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యే క కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కి య అధికారులతో కలిసి 2,000 పర్యావరణహిత గణేష్ ప్రతిమలతో పాటు మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలతో తయారైన ప్రతిమలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి, ఫల, పుష్ప, సీడ్స్ వంటి వాటితో తయారుచేసిన ప్రతిమలను వినియోగించడం ద్వారా పండుగను భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా నిర్వహించవచ్చని జేసీ పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో పాటు ప్రకృతి పరిరక్షణ బాధ్యతను కూడా స్వీకరిద్దాం అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు, పండుగలను ప్రకృతి హితంగా నిర్వహించేలా ప్రజలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెల శ్రీను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శ్రీనివాస్, జిల్లా టూరిజం ఆఫీసర్ డా. కొల్లేటి రమేష్, డీఆర్డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, పర్యావరణ మానవ సమాజ భద్రత, బాధ్యత ప్రెసిడెంట్ శ్రీనివాస్, వన్ ఎర్త్ వన్ లైఫ్ కోఆర్డినేటర్ లీలా కుమారి , డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





